బడి బాగుంది..

- నాడు–నేడుతో సర్కారీ స్కూళ్లలో అన్ని హంగులు
- కళకళలాడుతున్న విద్యాలయాలు
- జగనన్న ప్రభుత్వంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులు

కంచికచర్ల: గత టీడీపీ ప్రభుత్వం ప్రైవేట్ స్కూళ్లకు ప్రాధాన్యమిచ్చి సర్కారీ స్కూళ్లను నిర్లక్ష్యం చేసింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కరవయ్యాయి. ఇదంతా గతం ప్రభుత్వ హయాంలో జరిగింది. 2019లో అధికార పీఠం ఎక్కిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. నాడు నేడు కార్యక్రమంతో పాఠశాలలకు కొత్త హంగులు అమర్చారు. విద్యార్థుల ఉన్నతికి అవసరమైన వసతులు అందుబాటులోకి తెచ్చారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అనేక ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల మండలంలోని సర్కారీ బడులకు మహర్దశ పట్టింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాణ్యమైన విద్యనందించటంతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలను గవర్నమెంట్ స్కూళ్ల విద్యార్థులకు చేరువ చేయడానికి మన బడి నాడు–నేడు చేపట్టారు. దీంతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. తరగతి గదుల్లో సీలింగ్‌ఫ్యాన్లు, విద్యుత్ సౌకర్యం, ట్యూబ్ లైట్లు, నాణ్యమైన ఫర్నిచర్, రంగు రంగుల బెంచీలు, గ్రీన్ చాక్‌బోర్డులు ఏర్పాటు చేశారు. ఇంగ్లిష్ ల్యాబ్‌లు, ప్రహరీ పనులు కూడా పూర్తి చేశారు. దీంతో అనేకమంది ప్రభుత్వ స్కూళ్లలో చేరుతున్నారు.

మండలంలో రెండ దశల్లో 54 పాఠశాలల్లో నాడు– నేడు పనులు

కంచికచర్ల మండలంలో 54 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. మొదటి దశలో 18 స్కూళ్లలో నాడు నేడు పనులు చేపట్టి అభివృద్ధి పనులు పూర్తిచేశారు. రెండో దశలో మరో 36 పాఠశాలల్లో నాడు నేడు పథకం ద్వారా పలు పనులు చేపట్టామని ఎంఈఓ చిట్టిబాబు తెలిపారు. మండలంలో ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 47 స్కూళ్లల్లో పరిశుభ్రమైన తాగునీరు అందించడానికి మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ షెడ్యూలు ప్రకారమే నాడు–నేడు పనులన్నీ సక్రమంగా జరిగాయి. విద్యార్థులను ఆకట్టుకునేలా అందమైన వాల్ పెయింట్స్ వేశారు. ప్రతి క్లాస్ రూంలో రంగు రంగుల టేబుళ్లు ఏర్పాటుచేశారు. ఐఐటీ విద్యకు వేదికగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకున్నాయి. ఆన్‌లైన్‌లో పెద్దపెద్ద టీవీల ద్వారా తరగతులు నిర్వహిస్తున్నారు.



నిర్లక్ష్యం.. గత ప్రభుత్వం హయాంలో పెండ్యాలలో టాయిలెట్స్ ఇలా



బాధ్యత.. నాడు -నేడులో పెండ్యాల స్కూల్లో నిర్మించిన మరుగుదొడ్లు

నాడు..

పాఠశాలల పరిసరాలు అధ్వానం.. కుక్కలు, పందులు పాఠశాల ఆవరణల్లో విహారం.. విరిగిపోయిన తరగతి గదుల కిటికీలు, తలుపులు.. అలంకారప్రాయంగా ఫ్యాన్లు.. పెచ్చులూడిన శ్లాబ్.. పగుళ్లిచ్చి ప్రమాదకరంగా కనిపించే గోడలు, తలుపుల్లేని మరుగుదొడ్లు.. నీళ్ల లేక ఇక్కట్లు..విరిగిన కుర్చీలు, బల్లలు. ఇలా అనేక సమస్యలు గత ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ స్కూళ్లో దర్శనమిచ్చేవి.

నేడు..

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉన్నతికి చేపట్టిన నాడు నేడు పనులతో ప్రభుత్వ స్కూళ్లు బాగుపడ్డాయి. వసతులు ఏర్పాటుచేయడంతో ప్రభుత్వ స్కూళ్లు కళకళలాడుతున్నాయి. విద్యార్థులు కూర్చునే బల్లలు వివిధ రకాల రంగులతో అందంగా కనపడుతున్నాయి. స్కూళ్లకు నిరంతర విద్యుత్, నీటి సరఫరా ఉంటోంది. బాలబాలికలకు మరుగుదొడ్ల ఏర్పాటు, వాష్‌బేసిన్లు తదితర వసతుల ఏర్పాటుతో 'మన బడి' అందంగా కనపడుతోంది.



కొత్తకొత్తగా.. పరిటాల ఎంపీపీ స్కూల్లో రంగు రంగుల బెంచీలు



భలేగా.. రంగులతో విరాజిల్లుతున్న పెండ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



ఆటాడుకుందాం.. పరిటాల ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థుల కోసం జారుడుబల్ల



శుభ్రం చేసుకుందాం.. కొత్తగా హ్యాండ్‌వాష్



కళకళ.. కంచికచర్ల మండలం పెండ్యాలలో అన్ని హంగులతో ఎంపీయూపీ స్కూల్

ఐఐటీ లాంటి విద్యకు పునాది ప్రభుత్వ పాఠశాలలు



దేశంలో ఎక్కడాలేనంతగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలను మార్చారు. కార్పొరేట్ స్కూళ్ల కంటే ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులున్నాయి. ఐఐటీ లాంటి విద్యకు ప్రభుత్వ పాఠశాలలు వేదిక అవుతాయి. పెద్ద టీవీల ద్వారా శిక్ష, మరుగుదొడ్లు, తాగునీరు అందించడానికి మినరల్ వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటయ్యాయి. పభుత్వ పాఠశాలల ద్వారా నాణ్యమైన ఇంగ్లిష్ విద్యను కూడా అందిస్తున్నారు.

–ఎం.చిట్టిబాబు, ఎంఈఓ, కంచికచర్ల

క్లుప్తంగా

తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ దర్శనానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులతోపాటు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. తెలంగాణ నుంచి కూడా వందల సంఖ్యల వాహనాల్లో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు వాహనాల రద్దీ కొనసాగింది.

రేపు సామూహిక సత్యవ్రతం

వీరులపాడు(నందిగామ): జయంతి గ్రామంలోని కోదండ రామాలయంలో ఈనెల 4వ తేదీ పౌర్ణమి సందర్భంగా సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు యిప్పల శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో వ్రతానికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సాదా సాంబిరెడ్డి, ఉమ్మా వెంకటరెడ్డి, భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో డ్యాన్స్‌మాస్టర్ శేఖర్



పెనుగంచిప్రోలు: గ్రామంలోని తిరుపతమ్మను శుక్రవారం సినీ డ్యాన్స్‌మాస్టర్ శేఖర్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చిరంజీవి సినిమా భోళాశంకర్, మహేష్‌బాబు సినిమా గుంటూరు కారంతో పాటు రవితేజ, బాలకృష్ణ సినిమాల్లో పాటలకు నృత్యదర్శకత్వం చేస్తున్నానన్నారు. అమ్మవారు మహాశక్తి కలిగిన వారన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



గండేపల్లి(కంచికచర్ల) : ప్రభుత్వం పేదలను ఆదుకుంటోందని సర్పంచి బొక్కా రవికుమార్ అన్నారు. మండలంలోని గండేపల్లిలో ఈనెల 1వ తేదీన అనారోగ్యంతో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి మట్టి ఖర్చుల కింద వైఎస్సార్ బీమా పథకం ద్వారా మంజూరైన రూ.10వేల నగదును శుక్రవారం అందజేశారు. గ్రామానికి చెందిన కన్నెకంటి రమేష్(35) అనారోగ్యంతో మృతిచెందాడు. వైఎస్సార్ బీమా పథకం ద్వారా మృతుని కుటుంబసభ్యులకు మట్టిఖర్చుల కింద రూ. 10వేల నగదును అందజేశారు. త్వరలో మరో రూ. 90 వేలు మృతుని నామినీకి ప్రభుత్వం ఇస్తుందని సర్పంచి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పిల్లి భాగ్యరేణుక, ఉప సర్పంచి బెల్లంకొండ వెంకట సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మీశ్రీ కళ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణ

కంచికచర్ల: చిరిగిన చొక్కా తొడుక్కో కానీ మంచి పుస్తకం కొనుక్కో అంటూ కందుకూరి విరేశలింగం అన్న మాటను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, విజ్ఞాన సంపద అందించేవి గ్రంథాలయాలని శాఖ గ్రంథాలయ గ్రంథ పాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులతో పలు విభాగాల్లో ఆటలు ఆడించారు. తొలుత స్వాతంత్ర్య సమరయోధుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జయంతి వేడుకలు జరుపుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జెడ్పీ స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్, భవిత సెంటర్ ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు కనకారావు, డ్యాన్స్‌మాస్టర్ నవీన్‌నాని కవి సర్వేశ్వరరావు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. విశ్రాంత గ్రంథ పాలకుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

నందిగామ: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. పెనుగంచిప్రోలు చెందిన నలుగురు ఆటోలో నందిగామ కు వస్తున్నారు. 65వ నెంబర్ జాతీయ రహదారిపై పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఎదురుగా వస్తున్న బస్సు ఆటోలు ఢీకొన్నాయి. ఘటనలో ఆటో ప్రయాణికులు నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ హరీష్ తెలిపారు.

అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న చంద్రబాబు

ఏపీ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ సలహాదారు నాగార్జునరెడ్డి



తిరుమలగిరిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి



చిల్లకల్లు ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే ఉదయభాను

జగ్గయ్యపేట: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అరచేతిలో వైకుంఠం చూపించే వ్యక్తని మోసపూరిత హామీలివ్వడమే ఆయన నైజమని ఏపీ ప్రభుత్వ పంచాయతీ రాజ్ గ్రామాభివృద్ధి శాఖ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి విమర్శించారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. తిరుమలగిరిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల పరిశీలన, జగనన్న కాలనీ, రైతు భరోసా కేంద్రం, ముక్త్యాలలో గ్రామ సచివాలయం, జగనన్న కాలనీలో నిర్వహించిన గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. షేర్‌మహ్మద్‌పేటలో ఉద్యాన శాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పంట పొలాలు, అమృత సరోవర్ ట్యాంక్ పనులను పరిశీలించారు. అనంతరం చిల్లకల్లు మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో కలిసి డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలను మోసపూరిత హామీలతో చంద్రబాబు నట్టేట ముంచారన్నారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.. అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేస్తున్నారని చెప్పారు. కడప ఎంపీ అవినాష్‌రెడ్డిపై ఎల్లో మీడియా గ్లోబల్ ప్రచారం చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతూ రాజమండ్రిలో చంద్రబాబు ఏర్పాటు చేసిన మహానాడులో ఎన్నికల మేనిఫెస్టో అంటూ ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఆల్ ఫ్రీ బాబు అంటూ రాజశేఖర్‌రెడ్డి సాక్షాత్తూ అసెంబ్లీలో వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలే అమలు చేయలేక చంద్రబాబు చతికిలబడ్డాడని ఇప్పుడు ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని గమనించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు, ప్రత్యేకాధికారి బాలాజీ కుమార్, ఎంపీడీఓ జయచంద్ర, తహసీల్దార్ నాగరాజు, పంచాయతీ రాజ్ డీఈ మురళి, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్యామల, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సొంతింటి కల నిజం చేస్తున్నారు

ముక్త్యాల(జగ్గయ్యపేట): నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల హృదయాల్లో నిలిచిపోతారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. గ్రామంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో మార్కు సతీష్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ప్రకాశరావు, ఎంపీడీవో జయచంద్ర, ఈవోపీఆర్డీ సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నేతలు సయ్యద్ షాఉద్దీన్, దాది బ్రహ్మం, వెంకట నర్సయ్య, యండ్రాతి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో శుక్రవారం బెనిఫిషరీ ఔట్‌రీచ్, సిటిజన్ ఔట్‌రీచ్ విషయమై కొలిమి బజారులో ఉన్న 12వ సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వరరావు తనిఖీ చేశారు. సచివాలయ వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు విధుల్లో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు గుర్తించారు. సచివాలయంలో ఉన్న ఎడ్యుకేషన్, వెల్ఫేర్, సీఆర్పీ, వలంటీర్లపై ఉన్నతాధికారులకు రిపోర్టు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్లు బాధ్యతగా, సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు



నందిగామ టౌన్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం ముప్పాళ్లలో రూ. 21 లక్షలతో చేపడుతున్న డ్రైనేజీ, కల్వర్టు, సులభ కాంప్లెక్స్ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నల్లాని అయ్యన్న, వైఎస్సార్ సీపీ నేతలు కందుల నాగేశ్వరరావు, బండారుపల్లి కపిల్, వైఎస్ఎన్ ప్రసాద్, మార్త శ్రీను తదితరులు పాల్గొన్నారు.

త్రిశక్తి పీఠంలో వార్షిక మహోత్సవాలు

నందిగామ: పట్టణ శివారు పల్లగిరిగుట్టపై ఉన్న త్రిశక్తి పీఠంలో ఆలయ ఎనిమిదో వార్షిక మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు మూడు రోజులు జరుగుతాయి. ఉత్సవాల్లో మొదటిరోజు ఆలయంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞాన సరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కుంకుమ పూజలు చేశారు. భక్తులు పాల్గొన్నారు.

శాస్త్ర ప్రకారమే ఆలయ నిర్మాణాలు

దేవదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప



సూచనలు చేస్తున్న పరమేశ్వరప్ప, ఈఓ రమేష్‌నాయుడు, చైర్మన్ చెన్నకేశవరావు

పెనుగంచిప్రోలు: ఆలయ నిర్మాణాలు శాస్త్ర ప్రకారం జరగాలని రాష్ట్ర దేవదాయ శాఖ స్థపతి పి.పరమేశ్వరప్ప అన్నారు. శుక్రవారం ఆయన గ్రామంలోని శ్రీతిరుపతమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు ఆయనకు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఉపాలయం అంకమ్మ ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణ చేయడంతో పాటు, మెరుగైన దర్శనం చేసుకునేందుకు అవసరమైన సూచనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న కేశఖండనశాల, టాయిలెట్ బ్లాక్, వార్షిక కల్యాణ స్థలంతో పాటు ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వద్ద స్వాగత ద్వారం ఏర్పాటుకు సంబంధించి పరిశీలన చేశారు. ఆలయం ముందు రేకుల షెడ్ వేయడంతో గోపురాలు కనిపించడం లేదని, గాలి రాకుండా మూసేసిందని వెంటనే తీయాలని ఆలయ అధికారులకు సూచించారు. ఆలయం పక్కన షాపింగ్ కాంప్లెక్స్ మాదిరి దుకాణాలు ఏర్పాటు చేయడంతో ఇరుగ్గా ఉందని వాటిని బయట ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు, ఆదిమూలం నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 94 శాతం పింఛన్ల పంపిణీ



శనగపాడులో పింఛన్ ఇస్తున్న సచివాలయ సిబ్బంది

పెనుగంచిప్రోలు: మండలంలో శుక్రవారం సామాజిక పింఛన్ల పంపిణీ 94 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్ తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తెల్లవారు జాము నుంచే పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నారన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 14 సచివాలయాల పరిధిలోని 31 వార్డుల్లో ఉన్న వివిధ రకాల పెన్షన్లు అందజేశారు. మొత్తం 4,845 మందికి మొదటి రోజు, రెండవ రోజు కలిపి ఇప్పటికి 4,490 మందికి పెన్షన్లు అందజేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్. మల్లేశ్వరరావు తెలిపారు. 92.67 శాతం పంపిణీ చేశారన్నారు.

మహనీయుల ఆశయాలు ఆదర్శం



విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యే ఉదయభాను, కృష్ణమాదిగ

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు):

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మహనీయుల జీవితాలు అందరికీ ఆదర్శం కావాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉపప్రధాని బాబూజగ్జీవన్‌రాం విగ్రహాలను శుక్రవారం రాత్రి అనిగండ్లపాడులో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సర్పంచ్ బి జ్యోతిబ్రహ్మం, సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు, ఎస్సీసెల్ సీనియర్ నాయకులు వేల్పుల రవికుమార్, కార్యక్రమ నిర్వాహకులు దానయ్య మాస్టారు, ఎస్సీసెల్ నాయకులు దోసపాటి దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

కన్నెవీడు(వత్సవాయి): గ్రామంలో అంబేడ్కర్ సాధన సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలను ఎమ్మార్పీ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చావా దుర్గారాణి, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మమగతానాయక్ పాల్గొన్నారు.

ప్రజా సహకారంతో పట్టణ పరిశుభ్రత

మునిసిపల్ కమిషనర్ జయరాం



వార్డులో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్

నందిగామ: పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం కోరారు. పట్టణంలోని 16వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. దీనిలో భాగంగా డ్రెయిన్లలో పూడికతీతలు, పిచ్చి మొక్కల తొలగింపు, బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ తదితర కార్యక్రమాలు ముమ్మరంగా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సామాజిక సాధికారతకు నిలువుటద్దం

గడప గడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పెద్దాపురంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జయంతి(వీరులపాడు): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న పాలన సామాజిక సాధికారతకు నిలువుటద్దమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు పేర్కొన్నారు. జయంతి గ్రామంలో శుక్రవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి పథకాల అమలు తేదీతో క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ చంద్రబాబు వంచన పాలన సాగిస్తే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ప్రజలకు మంచి చేసే సంక్షేమ పాలన అందిస్తున్నారని జగన్‌మోహనరావు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, ఉప సర్పంచ్ ఇప్పల సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' సప్లిమెంటరీ

నందిగామ: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నందిగామలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 212 విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా వారిలో 179 మంది పరీక్ష రాశారు. 33 మంది విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు డీవైఈవో వెంకటప్పయ్య తెలిపారు.

నేటి నుంచి చంద్రశేఖరస్వామి ఆలయ ప్రతిష్టా ఉత్సవాలు

గన్నవరం రూరల్: పురుషోత్తపట్నంలో ఉన్న శ్రీ పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి ఆలయ పునః ప్రతిష్టా ఉత్సవాలు ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకూ జరుగుతాయని శివకేశవ ఆలయ అభివృద్ధి కమిటీ శుక్రవారం తెలిపింది. శనివారం ఉదయం గోపూజతో ప్రారంభమై 7వ తేదీ బుధవారం శాంతికల్యాణంతో ఉత్సవాలు ముగుస్తాయని, అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.

వృద్ధుడి మృతి

కంచికచర్ల: ఓ వృద్ధుడు ఎండ తీవ్రత తట్టుకోలేక మృతి చెందిన ఘటన పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా మధిర మండలం మడుపల్లి గ్రామానికి చెదిన గౌరవరపు సీతారాములు(65) ఈ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. భిక్షాటన చేసిన అనంతరం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో మేరీమాత విగ్రహం వెనుక ఉన్న డ్రైనేజీ బండపై కూర్చుని ఎండ తీవ్రతను తట్టుకోలేక మృతి చెందాడని స్థానికులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రాష్ట్రంలో పండగలా వ్యవసాయం



ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): రాష్ట్రంలో వ్యవసాయం పండగలా సాగుతోందని సర్పంచ్ జక్కులూరి రాంబాబు అన్నారు. వైఎస్సార్ జలకళలో భాగంగా శుక్రవారం రైతుల పొలాల్లో బోర్లు వేసే కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతోందన్నారు. రైతులు పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు బేరోతుల నాగమణి, మాజీ సర్పంచ్ చవల రామారావు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.